నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు

- అలంకారప్రాయంగా రైతు సేవా కేంద్రాలు
- అన్నదాతలకు అందని సేవలు
- ఎరువులు, పురుగు మందులు, విత్తనాల అమ్మకాలు నిలిపివేత



బోర్వంచ రైతు సేవా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రం

నూజివీడు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు మేలు చేకూర్చేందుకు వ్యవసాయ రంగంలో అనేక విప్లవాత్మకమైన సంస్కరణలను అమలు చేసింది. ఇందులో భాగంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల ముంగిటకే అన్ని రకాల ప్రభుత్వ సేవలను అందజేసింది. ఈ నేపథ్యంలోనే కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసి ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తే అవసరమైన ఎరువులు, క్రిమి సంహారక మందులు, విత్తనాలను రాయితీతో అందించేవారు. రైతులకు ఎంతగానో ఉపయోగపడిన కియోస్క్ యంత్రాలు కూటమి ప్రభుత్వంలో నిరుపయోగంగా మారాయి. దీంతో వ్యవసాయ సీజన్‌లో రైతులకు సకాలంలో అవసరమైన ఎరువులు అందడం లేదు.

నియోజకవర్గంలో 84 కియోస్క్ యంత్రాలు

నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని 84 రైతు సేవా కేంద్రాల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేశారు. దీని ద్వారా రైతు భరోసా కేంద్రంలో రైతులకు అందించే ప్రయోజనాలు ఆన్‌లైన్ చేసేవారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు తదితర వాటి కొనుగోలు కోసం రైతులు ముందస్తుగా నమోదు చేసి వాటికి నగదు చెల్లించేవారు. వెంటనే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వం రైతుల చేతికి అందించేది. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పని తప్పేది. ఫలితంగా రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు చేతికి అందేవి. రైతులు ఏ పంట వేయాలన్నా సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపర్చి ఉంచేవారు. అయితే ప్రస్తుతం ఆ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. వీటిని కూటమి ప్రభుత్వం మూలన పడేసింది.

రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్పు

రైతు భరోసా కేంద్రాల పేరును ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. పేరుకే సేవా కేంద్రాలు తప్పితే రైతులకు సేవలను అందించడంలో విఫలమయ్యాయని రైతులు విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు అందినట్లుగా ఈ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ సేవలు అందడం లేదని వాపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎరువులు, పురుగు మందులు, విత్తనాల సరఫరాను సైతం పూర్తిగా నిలిపివేయడంతో రైతు సేవా కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. ప్రభుత్వం విత్తనాలను, ఎరువులను, రసాయన మందుల సరఫరాను నిలిపి వేయడంతో కియోస్క్ యంత్రాలు పనిలేక నిరుపయోగంగా పడి ఉంటున్నాయి. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచైనా వాటిని వాడకలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

సేవలు పునరుద్ధరించాలి



రైతు సేవా కేంద్రాల ద్వారా వ్యవసాయ సేవలను ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలి. రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్ మెషీన్లు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి రైతులకు విత్తనాలు, ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలి.

– పాలడుగు విజయ్‌కుమార్, తుక్కులూరు

వినియోగం తగ్గింది



ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయాలు లేకపోవడంతో రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాల వాడకం తగ్గింది. సిబ్బంది హాజరు, ధాన్యం కొనుగోలు తదితర వాటికి యాప్‌లు రావడంతో దీని వాడకం చాలా వరకు తగ్గిపోయింది.

– జి.విద్యాసాగర్, ఏడీఏ, నూజివీడు

ప్రతిభకు పదును పెట్టాలి : కలెక్టర్ లక్ష్మీశ



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా తరఫున దక్షిణ భారత స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని బహుమతులు సాధించిన గంపలగూడెం మోడల్ స్కూల్ విద్యార్థి సుదక్ష, జగ్గయ్యపేట జెడ్పీ హైస్కూల్ పక్షాన పాల్గొన్న భార్గవ్, చైతన్య బృందాన్ని కలెక్టర్ తన కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం అభినందించారు. వారిని తీర్చిదిద్దిన అధ్యాపకులను సత్కరించారు. అనంతరం వారి ప్రాజెక్ట్‌లను గురించి అడిగి తెలుసుకున్నారు. ముమ్ముందు మరింత ప్రతిభావంతంగా పోటీల్లో పాల్గొని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు జిల్లా పక్షాన పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన విద్యార్థులు సైతం తమ విజ్ఞానానికి పదును పెట్టి విజయాలను సాధించాలని సూచించారు. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు, జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన సాంకేతిక సదస్సు



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న అజూర 2కే 25 సాంకేతిక సదస్సు శుక్రవారం ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య మాట్లాడుతూ సాంకేతిక సదస్సుల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చన్నారు. ఈసీఈ విభాగం విద్యార్థులకు పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, ట్రెజర్ హంట్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో వంటి పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు. ఈసీఈ విభాగాధిపతి వీవీజీఎస్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ సాయిరాం, వివిధ కళాశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



తిరువూరు: ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికారుల్లో జవాబుదారీతనం కోసం సమాచార హక్కు చట్టం అందుబాటులో ఉందని తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కెనడి అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని అన్ని శాఖల కార్యకలాపాలను తెలుసుకునే అవకాశం ఉందన్నారు. పౌర సమాచార అధికారులు సకాలంలో సమాచారం అందించకపోతే అప్పిలేట్ అధికారులకు దరఖాస్తు చేయవచ్చని చెప్పారు. మండల వ్యవసాయాధికారి పద్మ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంలో సెక్షన్లు, కాల పరిమితి, అపరాధ రుసుం తదితర అంశాలను వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారి కావ్యసింధు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



చాట్రాయి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సివిల్ సప్లయిస్ డీటీ వెంకటేశ్వరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని మర్లపాలెం గ్రామానికి చెందిన గుర్రం గోపిరాజు ఆటోలో 9 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా వీఆర్‌ఓ వెంకటేశ్వరరావు పట్టుకున్నారని చెప్పారు. పట్టుకున్న బియ్యాన్ని, ఆటోను స్వాధీనం చేసుకుని నిందితుడు గోపిరాజుపై కేసు నమోదు చేశామన్నారు..

1500 మందికి అన్నదానం



చాట్రాయి: సూరంపాలెంలో అన్నదాన సత్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. స్థల దాతలు దివంగత దిరిశాల పాపయ్య, నాగేశ్వరమణి కుమారులు దిరిశాల శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు ప్రారంభ పూజలు చేశారు. ఈ సందర్భంగా 1500 మందికి అన్నదానం చేశారు. ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ మాజీ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మోరంపూడి నాగేశ్వరావు, వనమా వాసు, వంకిణి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్యశాల ప్రారంభం



మైలవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన కృష్ణా మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాలను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవా దృక్పథంతో మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి యాజమాన్యానికి సూచించారు. కార్యక్రమంలో ద్వారకా తిరుమల దేవస్థానాల ధర్మకర్తల పాలక మండలి సభ్యుడు రాజా ఎస్వీఎస్ నివృతరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మందుల పంపిణీ



నులి పురుగుల నివారణ మందు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ రవిబాబు

తిరువూరు: నులి పురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా ఈ నెల 10వ తేదీన పాఠశాలల విద్యార్థులకు ఆల్ బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ రవిబాబు తెలిపారు. మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వైద్యా రోగ్య శాఖ సరఫరా చేసిన ఉచిత మందులను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. వైద్యారోగ్య, విద్యా శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కోరారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ..

చాట్రాయి: నులి పురుగుల నివారణకు మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నులి పురుగుల నివారణ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని చెప్పారు.ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ బ్రహ్మాచారి, సీహెచ్ఓ రమణ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్



విశాఖలోని హెచ్‌పీసీఎల్ రిఫైనరీ వద్ద విద్యార్థులు

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీ కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు రెండు రోజుల ఇండస్ట్రియల్ విజిట్‌కు వెళ్లారు. దీనిలో భాగంగా 34 మంది విద్యార్థులు కెమికల్ ఇంజినీరింగ్ హెచ్‌ఓడీ ఎం. మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో విశాఖపట్నంలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన రిఫైనరీని సందర్శించారు. హెచ్‌పీసీఎల్ యాజమాన్యం విద్యార్థులకు సంస్థ గురించి, సంస్థలో నిర్వహించే కార్యకలాపాల గురించి, ఉద్యోగ అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. రెండో రోజు పరవాడ మండలంలోని లంకెలపాలెంలో ఉన్న శ్రీకర్ ల్యాబొరేటరీని సందర్శించారు. కంపెనీ ప్లాంట్ హెడ్ చైతన్యవర్మ విద్యార్థులకు వివిధ యంత్రాల పనితీరును వివరించారు. విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో దోహదపడే ఇండస్ట్రియల్ టూర్‌కు తీసుకెళ్లడంపై డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్, ఏఓ బి.లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ చిరంజీవి, ఈఐటీపీ డీన్ పి.శ్యామ్‌లు అభినందించారు.

కుష్ఠు వ్యాధి లక్షణాలు గుర్తించాలి



కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తిరువూరు: కుష్ఠు వ్యాధి నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నందున ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వారు వెంటనే వైద్యారోగ్య శాఖను సంప్రదించాలని తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రేష్మాబేగం అన్నారు. తిరువూరు పట్టణంలోని ఇందిరా కాలనీలో శుక్రవారం కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, వెంట్రుకలు లేని మచ్చలను గమనిస్తే ఆరోగ్య కార్యకర్తలకు తెలియజేయాలని సూచించారు. చికిత్స ఆలస్యమైతే వ్యాధి ముదిరి అంగ వైకల్యానికి గురవుతారని, చేతులు, కాళ్ల వేళ్లు ముడుచుకుపోతాయని చెప్పారు. హెల్త్ సూపర్‌వైజర్ కె. రవి, హెల్త్ విజిటర్ ఎస్‌కే ఆశాబీ, ఏఎన్ఎంలు, వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అనంతరం కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ ఎ.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అమ్మవారితోట, ఎంప్లాయీస్ కాలనీ, జంక్షన్ రోడ్డు, ఆర్‌ఆర్ పేట, చిన్న గాంధీ బొమ్మ సెంటర్, కోనేరుపేట, పాలపేట, కొప్పుల వెలమపేట, రైతుబజార్ రోడ్డు, ఏరియా ఆస్పత్రి ప్రాంతం, గొడుగువారిగూడెం, గాంధీనగర్, కమ్మరిపేట, స్టేషన్‌తోట, ఢంఢంగార్డెన్, అజరయ్యపేట తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

జి.కొండూరు: జి.కొండూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సాధారణ మరమ్మతుల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఏఈ షఫీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని జి.కొండూరు, ఆత్కూరు, పినపాక, కట్టుబడిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని చెప్పారు.

● **భవానీపురం(విజయవాడపశ్చిమ):** గొల్ల పూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ రిలయన్స్ స్మార్ట్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) పి. రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. గద్దె వారి వీధి, ఉమ్మయ్య గారి బజార్, కట్ట బజార్, ఆశా హాస్పటల్ రోడ్డు, ఎస్‌ఆర్ కాలేజీ, మైలురాయి సెంటర్, భీమయ్యగారి రైస్ మిల్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

క్వారీ బండలతో సాగు చేయలేకపోతున్నాం

రైతుల నిరసన



వ్యవసాయ భూమిలో పడిన బండ రాళ్లు, . ధ్వంసమైన డ్రిప్ పైపులను చూపుతున్న రైతులు

జి.కొండూరు: మండల పరిధిలోని గడ్డమణుగులో యలో నిర్వహిస్తున్న మెటల్ క్వారీల వల్ల సాగు చేయలేకపోతున్నామని గడ్డమణుగు గ్రామానికి చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లోయ ప్రాంతంలోని క్వారీలలో బాంబులు పేలిన సమయంలో వ్యవసాయ క్షేత్రాలలో ఎగిరిపడుతున్న బండ రాళ్లను చూపుతూ రైతులు మీడియా ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ క్వారీలలో రిగ్గు బోరులు వేసి వందల అడుగుల లోతులో బాంబులను పెట్టి పేల్చడం వల్ల పెద్ద పెద్ద బండరాళ్లు తమ వ్యవసాయ భూములలో పడి పంటలు, సాగునీటి పైపులు, డ్రిప్ పైపులు ధ్వంసమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాంబులు పేలిన సమయంలో భూమి కంపించడం వల్ల బోర్లు కూడా పూడిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ఈ బండరాళ్లకు భయపడి కూలీలు సైతం పనులకు రావడంలేదని చెప్పారు. క్రషర్ల నుంచి వచ్చే దుమ్ము, వాహనాల రాకపోకల వల్ల వచ్చే దుమ్ముతో పంటలు సరిగ్గా పండకపోవడంతో దిగుబడి తగ్గిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. క్వారీల యజమానులకు తమ గోడును విన్నవించినా ఫలితం లేదని, ప్రతిగా తమపైనే బూతు పంచాంగం తెరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

నూజివీడులో వెట్టి చాకిరీ నిర్మూలన దినోత్సవం



ఫ్లైయాష్ ఇటుక తయారీ కార్మికులతో మాట్లాడుతున్న జడ్జి షేక్ పెద ఖాసిం

నూజివీడు: వెట్టి చాకిరీ అనేది సాంఘిక దురాచారమని, దీనికి ఎవరైనా పాల్పడితే చట్టప్రకారం శిక్షార్హులని సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం అన్నారు. వెట్టి చాకిరీ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఫ్లైయాష్ ఇటుకల తయారీ కార్మికులకు శుక్రవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ వెట్టిచాకిరీ నిర్మూలన చట్టం ప్రకారం నిబంధనలను ఉల్లంఘిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించవచ్చన్నారు. వెట్టి చాకిరీ కార్మికుల పునరావాసం కోసం ప్రభుత్వాలు పునరావాస సాయాన్ని అందిస్తాయని చెప్పారు. ఎక్కడైనా వెట్టిచాకిరీకి గురవుతున్న వారు ఉంటే సమాచారాన్ని వెంటనే తెలియజేస్తే వారిని వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించేందుకు వీలవుతుందన్నారు. అనంతరం కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాది ఎం.రవికాంత్, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు



తిరువూరు: స్థానిక వేంకటాచలస్వామి దేవస్థానంలో శుక్రవారం మూడో రోజు అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవ విగ్రహాలకు పూజాదికాల అనంతరం సేవాకాలం, సహస్ర నామార్చన తదితర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా జరిపారు. ఆలయ అర్చకులు అధ్యయనోత్సవాలు నిర్వహించారు.

బాలలతో పనులు చేయించడం నేరం



ఆంజనేయపురం(తిరువూరురూరల్): చిన్న పిల్లలతో పని చేయించడం చట్టవిరుద్ధమని, బడి ఈడు పిల్లలతో చాకిరీ చేయిస్తే యజమానులు, తల్లిదండ్రులు బాధ్యులవుతారని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్ హెచ్చరించారు. ఆంజనేయపురంలోని ఇటుక బట్టీని సందర్శించిన జడ్జి అక్కడ చిన్నపిల్లలతో పని చేయిస్తున్నట్లు శుక్రవారం గుర్తించారు. బడి ఈడు పిల్లలను వెంటనే పాఠశాలలకు పంపాలన్నారు. బార్ అసోసియేషన్ చైర్మన్ వాకదాని లక్ష్మీనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

కుల దూషణ కేసులో జైలు, జరిమానా

చిలకలపూడి (మచిలీపట్నం): షెడ్యూలు కులాలకు చెందిన మహిళను కులం పేరుతో అవమానించి, దూషించిన కేసులో ఇరువురికి ఆరు నెలలు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. చినబాబు శుక్రవారం తీర్పు చెప్పారు. జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామానికి చెందిన కొర్రపాటి మరియమ్మకు అదే గ్రామంలో ప్రభుత్వం కొంత భూమిని మంజూరు చేసింది. ఆ భూమిలో ఆమె సాగు చేసుకుంటుండగా అక్రమంగా ప్రవేశించిన మందినీల సాంబశివరావు, కోగంటి భారతిలు అసభ్యకరంగా మాట్లాడి కులం పేరుతో దూషించి అవమానించారు. ఈ ఘటనపై జి.కొండూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మచిలీపట్నం ఎస్సీ, ఎస్టీ కోర్టులో తొమ్మిది మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి కోగంటి భారతి, మందినీల సాంబశివరావుకు ఒక్కొక్కరికి ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష, రూ. 5 వేలు జరిమానా విధించారు. జరిమానా మొత్తాన్ని బాధితులకు అందివ్వాలని తీర్పులో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ఆర్టీఓ పద్మాకర్

మైలవరం: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు నిబంధనలు పాటించి సహకరించాలని విజయవాడ రవాణా శాఖాధికారి పద్మాకర్ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆర్టీఓ మాట్లాడుతూ భారతదేశంలో రోడ్డు ప్రమాదాల్లో ప్రతి రెండు, మూడు నిమిషాలకు ఒక ప్రాణం పోతోందన్నారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. పోలీసులతో కలిసి ప్రమాదాలు తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారాలపై సర్వే



చాట్రాయిలో సర్వే చేస్తున్న అధికారులు

చాట్రాయి: చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారాలపై సర్వే నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి వెంకటరత్నం అన్నారు. శుక్రవారం చాట్రాయిలో వ్యాపార సంస్థలపై నిర్వహిస్తున్న సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చేస్తున్న వ్యాపారాలపై ఎంత పెట్టుబడి పెడుతున్నారు? ఇంకా పెట్టుబడులు అవసరమా? అనే అంశాలపై సర్వే చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనలతో విజ్ఞానం పెంపు

మైలవరం: క్షేత్ర పర్యటనలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాల వృక్ష శాస్త్ర విభాగం విద్యార్థులు మద్రాస్ ఎడ్యుకేషనల్ టూర్‌కు వెళ్లారని చెప్పారు. మద్రాస్ యూనివర్సిటీ బోటనీ విభాగాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పరిశోధనల వివరాలు తెలుసుకున్నారని చెప్పారు. బిర్లా ప్లానిటోరియంలోకి వెళ్లి గెలాక్సీలో ఉన్న వివిధ నక్షత్రాలను, సూర్య కుటుంబంలోని గ్రహాలను వీడియో ద్వారా తిలకించారన్నారు. దక్షిణ భారత దేశంలో అతి పెద్ద లైబ్రరీ చెన్నైలోని అన్నా సెంటినరీ లైబ్రరీని సందర్శించి పుస్తకాలు వివరాలు సేకరించారని చెప్పారు. మద్రాస్‌లోని పలు ప్రదేశాలను సందర్శించి వివరాలు సేకరించారని వివరించారు. సమావేశంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వైద్యుడి వితరణ

తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు భవాని ఆస్పత్రి వైద్యులు సుభాష్, కవితా చౌదరి రూ.10 వేల విరాళాన్ని శుక్రవారం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శంకరరావుకు అందజేశారు. సైకిల్ స్టాండు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు పాఠశాల ఉపాధ్యాయులు చేసిన విజ్ఞప్తి మేరకు తిరువూరు కేవీ టెక్స్‌టైల్స్ అధినేత కేవీ నరసింహారావు, పీటీ కొత్తూరుకు చెందిన అంబటి వెంకటనారాయణ విరాళాన్ని అందజేశారు.

పోలీస్ స్టేషన్‌కు జిరాక్స్ మెషిన్ అందజేత

ఆగిరిపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సినీ నటి అన్నే సంజన జిరాక్స్ మెషిన్‌ను అందించారు. మండలంలోని కృష్ణవరానికి చెందిన అన్నే సంజన తండ్రి ధన కోటేశ్వరరావు శుక్రవారం ఎస్ఐ శుభశేఖర్‌కు జిరాక్స్ మెషిన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శుభశేఖర్ సంజన తండ్రి ధన కోటేశ్వరావును సన్మానించారు.

టెన్త్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

విస్సన్నపేట: మండలంలోని కొండపర్వ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు విస్సన్నపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. విద్యా నిపుణులు కోటిరెడ్డి, సాంబశివరావు, ఉపేంద్ర మాట్లాడారు. నరసాపురం గురుకుల పాఠశాల, వికాస్ ఫార్మసీ కళాశాలల్లో కూడా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం జరిగింది.